
సాక్షి ఒడిశా

శనివారం । 28 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,80,457లు, బంగారం 420 మిల్లీగ్రాములు, వెండి 83 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



దొందూ దొందే

- బీజేపీ, బీజేడీ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు - 8లో



వయోవృద్ధుల తీర్థయాత్ర

- భువనేశ్వర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు పయనం - 8లో

న్యూస్‌రీల్

పోలీసుల క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సుశ్రీ

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా పోలీసుల క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని జానకీనగర్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను ఎస్పీ ఎస్.సుశ్రీ ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందిని ఉత్సాహ పరిచారు. పపడాహండి పోలీసులతో జరిగిన మ్యాచ్‌లో రిజర్వ్ పోలీసుల జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో ఏడీఎం భాస్కర్ రైతా, జిల్లా అథ్లెటిక్ సంఘం ఉపాధ్యక్షుడు ఎం.బాలకృష్ణారావు, డీఎస్పీ చంద్రశేఖర్ హొత్తా తదితరులు పాల్గొన్నారు.

సారా దుకాణంపై మహిళల దాడి



సారా దుకాణం వద్ద గుమిగూడిన మహిళలు

బరంపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా హింజిలిట్ బ్లాక్‌లో నాటు సారా దుకాణంపై వందలాది మంది మహిళలు సామూహికంగా దాడి చేశారు. దుకాణంలోని సారా ప్యాకెట్లు, తయారీ సామగ్రి ధ్వంసం చేసి, పోలీసుల ఎదుటే నిప్పంటించారు. శాసన అంబగామం పంచాయతీలో నడుస్తున్న ప్రభుత్వ అనుమతి పొందిన సారా దుకాణాన్ని మూసి వేయాలని స్థానిక మహిళలు పలుమార్లు హింజిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎవరూ పట్టించుకోక పోవడంతో సర్పంచ్ జనార్దన్ సెఠి, పెద్ద సంఖ్యలో మహిళలు ర్యాలీగా అక్కడికి చేరుకున్నారు. సారా తాగుతున్న వ్యక్తులను చితకబాది, అనంతరం దుకాణాన్ని ధ్వంసం చేశారు. సారా కారణంగా తమ కుటుంబాలు ఛిద్ర మవుతున్నాయని, దీనిని అధికారులే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

చిత్రకొండలో బీఎస్‌ఎఫ్ వైద్య శిబిరం



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా పిపల్లపొదర్ 88–బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో పిపల్లపొదర్, డుమ్రిపొదర్, తెంతులిపొదర్, మాటమ్‌గూడ, మంజురిలండి, డుడుమాగూడ గ్రామాలకు చెందిన 205మందికి వైద్యులు టీడీ సింగ్, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులతో పాటు గ్రామస్తులకు రేడియోలు, టార్చిలైట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండర్ వినోద్ సరాన్, నక్కమమ్ముడి పంచాయతీ సర్పంచ్ లక్ష్మి ముదులి, వార్డు సభ్యుడు సుకదేవ్ ఖిలో, జవాన్లు పాల్గొన్నారు.

కొనసాగిన సరస్వతీ పూజలు



సంగీత కళాకారుల కార్యాలయంలో సరస్వతీ పూజలు

జయపురం: పట్టణంలో గురువారం ప్రారంభమైన చదువుల తల్లి సరస్వతీ దేవి పూజలు శుక్రవారం సైతం కొనసాగాయి. వివిధ పాఠశాలలు, జయపురం విక్రమ్ ఆర్ట్స్, క్రాఫ్ట్ కళాశాలలో పూజలు నిర్వహించారు. వినూత్న రీతిలో తయారు చేసిన వాగ్దేవీ ప్రతిమను తిలకించేందుకు విద్యార్థులు, భక్తులు ఆసక్తి చూపారు. అలాగే సరస్వతీ శిశు మందిరంలో హోమం చేపట్టారు. జయపురం సంగీత కళాకారులు నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులు ధీరేన్ మోహన పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ శిశు మందిరం పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



గిరిధర్ గమాంగ్‌ను వేదికపైకి ఆహ్వానిస్తున్న కేసీఆర్



ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం చంద్రశేఖరరావు, పక్కన ఒడిశా నాయకులు

కారెక్కిన కొరాపుట్ నేతలు

- బీఆర్‌ఎస్‌లో చేరిన ఉమ్మడి కొరాపుట్ జిల్లాల నాయకులు
- మాజీ సీఎం గిరిధర్ గమాంగ్‌ను సాదరంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షుడు కేసీఆర్
- అనుసరించిన మాజీ ఎంపీలు హేమ, జయరాం, కీలక నాయకులు
- రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం

కొరాపుట్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధ్యక్షుడిగా ఏర్పడిన భారతీయ రాష్ట్ర సమితిలో ఉమ్మడి కొరాపుట్ జిల్లాల నాయకులు భారీ సంఖ్యలో చేరారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమ వేదిక ప్రాంగణం ఒడిశా నేతలతో నిండిపోయింది. వచ్చే వారి కోసం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు కేసీఆర్ ప్రత్యేక విమానం పంపించడంతో వీరంతా ఉత్సాహంగా తరలి వెళ్లారు. దీంతో ఉదయం నుంచే రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరందరికీ కండువాలు వేసిన కేసీఆర్.. సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్, మాజీ ఎంపీ జయరాం పంగిని వేదిక్పై తనకు ఇరువైపులా కూర్చొబెట్టుకున్నారు. అలాగే గిరిధర్ సతీమణి, మాజీ ఎంపీ హేమ గమాంగ్, కుమారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిశిర్ గమాంగ్, అతని భార్య శౌర్య గమాంగ్, జయపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుధీర్ షడంగి, కొరాపుట్ లోక్‌సభ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రవీంద్ర మహాపాత్రొ బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు.

చేరిన వారిలో..

రాష్ట్రం నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో బీజేపీ యువమోర్చా సాధారణ కార్యదర్శి స్నేహరంజన్ దాస్, ఫల్గుణి శబర్, మాల్యరంజన్ స్వాయి, మయూర్‌భంజ్ మాజీ ఎంపీ రామచంద్ర హండ్సా, మాజీ ఎమ్మెల్యే బృందావన్ మాఝి, మాజీ ఎమ్మెల్యే నవీన్ నందో, బండారి ఫొఖిరీ, మాజీ ఎమ్మెల్యే రథ్ దాస్, బంజర్‌పూర్ మాజీ ఎమ్మెల్యే అర్జున్ దాస్, బలిపట్న మాజీ ఎమ్మెల్యే రాఘవ్ శెఠి, బరి మాజీ ఎమ్మెల్యే దేవాశిష్ నాయక్, మాజీ ఎమ్మెల్యే దేవరాజ్ శెఠి, భగీరథ శెఠి, మైదర్ జెన్నా, పి.గోపాల్‌రావు, కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి మాజీ చైర్మన్ నారాయణరావు, పొట్టంగికి చెందిన ప్రతాప్, మల్కన్‌గిరి జిల్లాకు చెందిన రామచంద్ర మడకామి, గోవింద మండల్, నిఖిల్ బిశ్వాస్, బెను హంతాల్, అమల్ మండల్, సమ్రూ సిసా, గోపి పంగి, టిల్లి పంగి, నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్‌కు చెందిన శ్రీరామ్మూర్తి ఉన్నారు.

ఇది 'మహా'యుద్ధం..

చేరికలో భాగంగా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రసంగించారు. ప్రస్తుతం జరుగుతున్నది మహా యుద్ధమని తెలిపారు. ఒడిశాలో మహానది నీరు ఎక్కడికి పోతోందని ప్రశ్నించారు. అందులో కేవలం 25 శాతం నీటిని మాత్రమే ప్రజలు వినియోగిస్తున్నారని, రైతుల సమస్యలను బీజేడీ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశంలో రైతుల సంక్షేమం కోసమే ఈ పోరాటమన్నారు. ఒడిశాలోని థాల్చేర్‌లో ఉన్న బొగ్గు గనులు ఎంతో నాణ్యమైనవని, దీనికి ప్రపంచ మార్కెట్‌లో ఎంతో విలువ ఉందని పేర్కొన్నారు. సహజ సంపదలు పరిరక్షించుకోలేని స్థితిలో పాలకులు ఉన్నారని దుయ్యబట్టారు. ఎంతో సుదూరంగా ఉన్న ఒడిశా నుంచి ఇంతటి భారీ సంఖ్యలో నేతలు రావడం ఆనందంగా ఉందన్నారు. తన ప్రసంగంలో పదే పదే గిరిధర్ గమాంగ్, జయరాం పంగి లను పొగడ్తలతో ముంచేత్తారు.



శిశిర్ గమాంగ్‌కు కండువా వేస్తున్న కేసీఆర్



మాజీ ఎంపీ జయరాం పంగిని బీఆర్‌ఎస్ లోకి ఆహ్వానిస్తున్న దృశ్యం



బీఆర్‌ఎస్‌లో చేరేందుకు వచ్చిన వివిధ పార్టీలకు చెందిన ఒడిశా నాయకులు

ప్రత్యేక విమానంలో పయనం..

జయపురం: భారతీయ రాష్ట్రీయ సమితి(బీఆర్‌ఎస్)లో చేరేందుకు కొరాపుట్ జిల్లాల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ నేతలు పయనమయ్యారు. వీరిలో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకులు గిరిధర గమాంగ్, అతని భార్య హేమ, కుమారుడు శిశిర్, కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి తదితర కీలక నాయకులు ఉన్నారు. వీరంతా భువనేశ్వర్ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్లారు. కొరాపుట్, నవరంగపూర్, మల్కన్‌గిరి, రాయగడ, కలహండి తదితర జిల్లాలు తెలంగాణ సరిహద్దుకు అనుకొని ఉండటంతో బీఆర్‌ఎస్ ప్రభావం ఈ ప్రాంతాలపై ఉండవచ్చని రాజకీయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.



ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్తున్న హేమ గమాంగ్, శిశిర గమాంగ్

దివ్యాంగులకు పీఎంఏవై ఇళ్లు కేటాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగ సంఘం ప్రతినిధులు

పర్లాకిమిడి: కేంద్రప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లలో 5శాతం దివ్యాంగులకు కేటాయించాలని 2016లో మార్గదర్శకాలు వెలువడ్డాయి. దీనిని రాష్ట్రంలోనూ వర్తింపజేయాలని గజపతి జిల్లా దివ్యాంగుల మంచ్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిరంజన్ బెహరా డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. జిల్లా అధికారులు దివ్యాంగుల చట్టం–2016ను అమలు చేయాలని కోరారు. దీనికి సంబంధించి వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండాకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంతోష్ మహరాణా, నిరంజన్ బెహరా, పప్పుల చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి శ్రీకారం



అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తున్న కార్మికశాఖ మంత్రి శ్రీకాంత్ సాహు

బరంపురం: గంజాం జిల్లా బుగడా బ్లాక్ పరిధిలోని వివిధ గ్రామాలకు తాగునీటి సమస్య తీర్చే విధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.2.56 కోట్ల నిధులతో చేపట్టిన తాగునీటి అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి శ్రీకాంత్ సాహు శుక్రవారం శ్రీకారం చుట్టారు. అలాగే బుగడా బ్లాక్‌లో ఎస్‌పీసీ నూతన భవనం, తుడుకుపల్లి, లోక్‌నాథ్ పూర్ గ్రామాల్లో గ్రామీణ తాగునీటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు అమితా సాహు, జిల్లా పరిషత్ సభ్యులు ఎస్.కిశోర్‌చంద్ర, సర్పంచ్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాజ్‌గురుకు నివాళులర్పించిన ఎస్పీ



రాజ్‌గురు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శరవణ్ వివేక్



హాజరైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

బరంపురం: నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చిరంజీవి రాజ్‌గురు ఇటీవల గుండెపోటుకు గురై, ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు బరంపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ పాల్గొని, రాజ్‌గురు చిత్రపటం ఎదు ట జ్యోతి వెలగించి, నివాళులర్పించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రవికుమార్ బెహరా మాట్లాడుతూ ఒకవైపు న్యాయవాదిగా, మరొవైపు జర్నలిస్టుగా విధి నిర్వహణలో పేదల పక్షాన నిలిచారని కొనియాడారు. నిత్యం ప్రజల సమస్యలపై కథనాలతో ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులంతా మౌనం పాటించి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒడియా, హిందీ, ఇంగ్లిషు, తెలుగు దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి వంశధార వసంతోత్సవాలు



మినీ మారథాన్‌ను ప్రారంభిస్తున్న సాబొరో

- ఉత్సాహంగా సాగిన మినీ మారథాన్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో వంశధార వసంతోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో నేతృత్వంలో ఈ ఉత్సవాలు ఫిబ్రవరి 1వరకు కొనసాగనున్నాయి. ఆదివాసీ సంస్కృతికి అద్దంపట్టే ఈ ఉత్సవాలు ఏటా వంశధార వసంతోత్సవాల పేరిట నిర్వహిస్తుంటారు. అయితే గత రెండేళ్లు కరోనా మహమ్మారి కారణంగా వేదిక వరకు మాత్రమే పరిమితం చేశారు. ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. గిరిజన సంప్రదాయానలు ప్రతిబింబించే విధంగా వేదిక ముస్తాబైంది. వివిధ స్టాల్‌లు రూపుదిద్దుకున్నాయి. గుణుపూర్ లోని కపిల్‌పూర్‌లో వసంత మహోత్సవ గ్రౌండ్ విద్యుత్ కాంతులతో సుందరంగా రూపుదిద్దుకుంది.

ఉత్సాహంగా మారథాన్..

వసంతోత్సవాల్లో భాగంగా గుణుపూర్ కళాశాల వద్ద మినీ మారథాన్ రేస్ శుక్రవారం నిర్వహించారు. గుణుపూర్ సమితి అధ్యక్షురాలు ఝిల్లి సాబొరో హాజరై, పోటీని ప్రారంభించారు. ఇందులో వందలాది ధిమంది యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కపిల్‌పూర్‌లో జరగనున్న ఉత్సవాల వేదిక వరకు సాగిన రేస్‌కు అనూహ్య స్పందన లభించింది.





ముస్తాబవుతున్న వేదిక

ఉత్సవ లోగో ఆవిష్కరణ

వసంతోత్సవాలను పురష్కరించుకుని ఉత్సవ లోగోను నిరాహకులు ప్రారంభించారు. ఆదివాసీల వాయిద్యాలకు ప్రాధాన్యతనిస్తూ రూపుదిద్దుకున్న లోగో అందరినీ ఆకట్టుకుంది. అలాగే శనివారం ప్రారంభం కానున్న వసంతోత్సవాలకు రైల్వే వాల్తేర్ డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) అనూప్‌కుమార్ శత్పతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మమత గొడో హాజరు కానున్నారు.

31న జయపురానికి సీఎం రాక



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు, పూర్వ విద్యార్థులు

- జయపురం కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల విజయవంతానికి కమిటీ పిలుపు

జయపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈనెల 31న జయపురానికి రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమఘ్నమైంది. రాష్ట్రంలో పురాతనమైన జయపురం విక్రమదేవ్ కళాశాల(అటానమస్) ప్రారంభించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. దీనికి సంబంధించి చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ మహ్మద్ అక్తార్, ఎస్పీ అభినవ సోన్‌కార్ పరిశీలించారు. జయపురం విక్రమ్ క్రీడా మైదానం(దసరా పొడియా), విక్రమదేవ్ కళాశాల క్రీడా మైదానాలను సందర్శించి, సభా కార్యక్రమానికి సరైన స్థలం నిమిత్తం స్థానిక అధికారులతో చర్చించారు. అలాగే హెలికాప్టర్ దిగేందుకు, అక్కడి నుంచి కళాశాలకు చేరుకునేందుకు అనువైనా మార్గాన్ని నిర్ణయించారు. హెలికాప్టర్ ర్యాంప్, ఇతర నిర్మాణ పనులు బాధ్యతలపై ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ భాస్కర సామంతరాయ్‌కు సూచనలు అందించారు. పరిశీలనలో జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, డీఆర్‌డీఏ పీడీ గౌరవ శివాజీ ఇశాల్‌వార్, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

విశ్వ విద్యాలయంగా గుర్తించాలనే ప్రతిపాదన..

జయపురం: పట్టణానికి సీఎం రానున్న సందర్భంగా ఘన స్వాగతం పలికి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జయపురం విక్రమదేవ్ కళాశాల ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా కళాశాలలో కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర పట్నాయక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మాజీమంత్రి రబినారాయణ నందో, మాజీ ఎమ్మెల్యే గుప్త ప్రసాద్‌దాస్, కళాశాల ప్రిన్సిపాల్ గోపాల హల్‌దార్, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కళాశాల మాజీ అధ్యక్షుడు దుర్గాశంకర సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 31న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభిస్తారని, ఫిబ్రవరి 1న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే విక్రమదేవ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా గుర్తించేలా సీఎం ఎదుట కొరాపుట్ జిల్లా ప్రజల చిరకాల కోరికను విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అజిత్ సాహు, దేవేంద్ర బాహిణీపతి, రాధామోహన గౌఢ, ధర్మేంద్ర అధికారి, హిమాంశు మహాపాత్రొ, శంకర ప్రహరాజ్, సహదేవ్ పట్నాయక్, రాజేంద్ర గౌఢ, నిషాన్ పట్నాయక్, భిబు పండా, సిద్ధార్థ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



తైక్వాండో ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు పూర్తయ్యాయి. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జి స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలు మూలల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరుకాగా..వారికి క్యాడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఎంపిక నిర్వహించారు. ఆద్యంతంఉత్కంఠ భరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 29,30,31 తేదీల్లో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. ఎంపికలను ఎం.వాగ్దేవి, అనిల్‌కుమార్, రామకృష్ణలు పర్యవేక్షించారు.

అంతర్ విశ్వవిద్యాలయాల బీబీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు



పి.అవ్యక్త



డి.శ్రియ

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 28 నుంచి చెన్నైలోని బీఎస్ అబ్దుల్ రెహ్మన్ క్రిసెంట్ ఐటీలో జరగనున్నాయన్నారు. ఇటీవల జీఎంఆర్ ఐటీలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించగా పి.అవ్యక్త, డి.శ్రియలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ శశికుమార్‌లతోపాటు విద్యార్థులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

తెర్లాం: ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ శుక్రవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఐదు ట్రాక్టర్లపై ఇసుకను వేరే మండలానికి తీసుకువెళ్తున్నారని, సమాచారం రావడంతో పోలీస్‌స్టేషన్ వద్ద వాటిని పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాలిపోయిన ధాన్యం



కాలిపోయిన ధాన్యం చూస్తున్న గ్రామస్తులు

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామానికి చెందిన రైతు సాదెం సింహాచలంనాయుడి ధాన్యం కాలిపోయాయి. పోలినాయుడువలస సమీపంలో కౌలుకు చేస్తున్న రెండు ఎకరాల పంటను నూర్పు చేసి రాశులుగా ధాన్యం, గడ్డి కుప్పలు కళ్లంలో పెట్టగా గుర్తుతెలియని వ్యక్తులు ధాన్యం కుప్పలకు నిప్పుపెట్టారు. దీంతో పక్కనే ఉన్న ధాన్యంలో కొంతభాగం కాలిపోయాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతు సింహాచలం కోరుతున్నాడు.

ఆర్టీసీ ఢీకొని యాచకుడి మృతి



బస్సును ఢీకొని చనిపోయిన యాచకుడు అప్పారావు

శృంగవరపుకోట: స్థానిక దేవీ జంక్షన్ వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ యాచకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కింతుమండ నుంచి విశాఖ వెళ్తున్న ఎస్.కోట డిపో ఆర్టీసీ బస్ స్థానిక దేవీ జంక్షన్‌కు వస్తున్న సమయంలో యాచకుడు అప్పారావు (70) రోడ్డు దాటుతూ బస్ ముందు భాగంలో ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యాచకుడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పారావు గతంలో విశాఖ జిల్లాలోని చిలకలగెడ్డ గ్రామంలో ఇటుకల బట్టీలో పని చేసేవాడని, తర్వాత ఎస్.కోటలో అప్పన్న హోటల్‌లో సర్వర్‌గా కొంత కాలం పని చేశాడని తెలిసింది. కొంతకాలంగా యాచిస్తూ, జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో అప్పారావు పూటుగా మద్యం తాగి ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. మద్యం మత్తులో హఠాత్తుగా బస్సును ఢీకొన్నాడని డిపో మేనేజర్ కె.రమేష్ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.



జయపురం: పాదయాత్రలో పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్, ఎంపీ ఉల్క, ఎమ్మెల్యే తారాప్రసాద్



రాయగడ: ప్రజలకు అభివాదం చేస్తున్న శరత్ పట్నాయక్, పక్కన సప్తగిరి, రత్నమణి



రాయగడ: పాదయాత్రలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ నాయకులు

దొందూ దొందే

- బీజేపీ, బీజేడీ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ విమర్శలు
- రాయగడ, కొరాపుట్, జయపురంలో పాదయాత్ర



కొరాపుట్: లక్ష్మీపూర్‌లో గిరిజన మహిళ సమస్య వింటున్న శరత్ పట్నాయక్

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, దొందూ దొందేనని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ఎద్దేవా చేశారు. భారత్ జోడో యాత్రకు మద్దతుగా చేపట్టిన హత్తరే హత్తో పాదయాత్రలో శుక్రవారం ఆయన రాయగడ చేరుకున్నారు. ఈ సందర్భంగా కొరాపుట్ మీదుగా రాయగడ సరిహద్దుకు చేరుకుంది. అక్కడ ఐఎన్‌టీయూసీ నాయకుడు భవానీ జెనా నేతృత్వంలో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి పాదయాత్రగా వచ్చిన పట్నాయక్ కొత్త బస్టాండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కపిలాస్ కూడలి వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా నేతృత్వంలో కార్యకర్తలు ఆయనను ఆహ్వానించారు. బుదరావలస వరకు పాదయాత్రలో పాల్గొన్న శరత్ పట్నాయక్ విలేకర్లతో కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రంలో అవినీతి పేరుకు పోయిందని, గత 2 దశాబ్దాలకు బీజేడీ పాలనలో రాష్ట్రం ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎటువంటి పురోగతి సాధించలేదని ఆరోపించారు. వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బ తిందని, రైతుల హాహాకారాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా సంక్షేమ పథకాల పేరుతో జనం నోట్లో మట్టి కొడుతున్న అధికార పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం పూర్తిగా అవినీతికి తలమానికంగా మారిందన్నారు.

అధికారంలోకి వస్తాం..

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీల వల్ల ప్రజలు పూర్తిగా మోసపోయారని, రానున్న ఎన్నికలే వారి నిరంకుశ పాలనకు జవాబు చెబుతాయని తెలిపారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచే అవిభక్త కొరాపుట్ జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం దక్కుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న భరత్ జోడో యాత్రలో పార్టీకి ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తుందన్నారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క, పీసీసీ ఉపాధ్యక్షురాలు రత్నమణి ఉల్క, తదితర నాయకులు పాల్గొన్నారు.

వేలాది కార్యకర్తలతో..

కొరాపుట్: ఒడిశా పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్ చేస్తున్న హత్తరే హత్తో యాత్ర కొరాపుట్ జిల్లాలో ప్రభావవంతంగా సాగింది. జిల్లా కేంద్రంలో వేలాది మంది కార్యకర్తల నడుమ కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి, డీసీసీ అధ్యక్షురాలు మీనాక్షి బహినీపతి, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రాంఖడం ఆయనకు స్వాగతం పలికారు. కొరాపుట్ పట్టణం నుంచి లక్ష్మీపూర్ వైపు యాత్ర సాగింది. దారి పొడుగునా గిరిజనుల కష్టాలు తెలుసుకుంటూ ముందుకు కదిలారు. కక్కిరిగుమ్మ మీదుగా యత్రా రాయగడ జిల్లా వైపు కదిలింది. మధ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శిస్తూ సాగారు. బహినీపతి దంపతులు తమ రాజకీయ బలాన్ని ర్యాలీలో చూపించారు. ప్రతి చోటా ఎంపీ, ఎమ్మెల్యేలు పీసీసీ చీఫ్‌కు రెండు వైపులా నడుస్తూ కనిపించారు.

అపూర్వ ఆదరణ..

జయపురం: శరత్ పట్నాయక్ నిర్వహిస్తున్న పాదయాత్రకు కొరాపుట్ జిల్లాలో అపూర్వ ఆదరణ లభించింది. ఈనెల 26న నవరంగపూర్ జిల్లా మీదుగా కొరాపుట్ జిల్లాలో ప్రవేశించిన ఆయనకు జయపురం సరిహద్దు వద్ద నాయకులు, గిరిజనులు సంప్రదాయ నృత్య, వాయిద్యాలతో స్వాగతం పలికారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీణాక్షి బాహిణీపతి, బొరిగుమ్మ సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ గంతాయత్, రాష్ట పీసీసీ సభ్యులు రామచంద్ర పాఢి, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో పీసీసీ చీఫ్ ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘనం విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు.



జయపురం: సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు



కొరాపుట్: సంప్రదాయ నృత్యాలతో యాత్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



బొరిగుమ్మలో భారీగా చేరిన కాంగ్రెస్ శ్రేణులు

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- బిసంకటక్ ఐరన్ పైపుల కేసును ఛేదించిన పోలీసులు



రాయగడ: పోలీసుల అదుపులో దోపిడీ దొంగలు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ పోలీస్ స్టేషన్ పరిధి కుమార్‌ధామిని పంచాయతీలో డిసెంబర్ 4న చోటు చేసుకున్న చోరీ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో నిర్మాణంలనో మెగా తాగునీటి ప్రాజెక్టుకు చెందిన 354కాస్ట్ ఐరన్ పైపులు అపహరణకు గురైనట్లు సంబంధిత కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్‌డీపీఓ ఆకాశ్‌చంద్ర సాహు బిసంకటక్ సమితి గొతిగుడ గ్రామానికి చెందిన జొగొబంధు జెనా, రంజన్ పిరిసిక, బిసంకటక్ బొడో హరిజన వీధికి చెందిన దురోజ్యు కౌసల్య, శ్రీకాకుళానికి చెందిన వారణాసి ప్రవీణ్, వారణాసి రాజేష్ నిందితులుగా గుర్తించారు. రాష్ట్రప్రభుత్వం తాగునీటి సమస్య నివారణ చర్యలో భాగంగా బిసంకటక్ సమితిలో మెగా తాగునీటి ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో నిర్మాణ పనులకు సంబంధించి కుంభారిధాముని పంచాయతిలో నిల్వ ఉంచిన రూ.35 లక్షల విలువైన పైపులు దుండగులు అపహరించారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.



నిమ్మఖండి పోలీస్ స్టేషన్ వద్ద నిందితులు

పోలీసులపై దాడి చేసిన దుండగులు..

బరంపురం: నగర శివారు బొరిగామ్ గ్రామంలో జరుగుతున్న రాధాకృష్ణ మందిర ప్రతిష్ఠ ఉత్సవాల్లో పోలీసులపై దాడికి పాల్పడిన ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఐఐసీ అధికారి సవ్యసాచి మాలిక్ అందించిన సమాచారం ప్రకారం నిమ్మకండి పోలీసు స్టేషన్ పరిధి బొరిగామ్ గ్రామంలో జరుగుతున్న రాధాకృష్ణ మందిర ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఒపెరా నాటక ప్రదర్శన జరుగుతున్న సమయంలో గ్రామస్తుల మధ్య కొట్లాట జరిగింది. ఆ సమయంలో ఇరువర్గాలను శాంతింప జేసేందుకు వెళ్లిన పోలీసులపై కొంతమంది దుండగులు దాడికి పాల్పడ్డారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో గంజాం జిల్లా బొరిగామ్ గ్రామానికి చెందిన చింకు సెఠి, రింకు సెఠి, భగవాన్ సెఠి, గంగదర్ సెఠి, భుత సెఠిగా ఉన్నట్లు గుర్తించారు.

వయోవృద్ధుల తీర్థయాత్ర

- భువనేశ్వర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు పయనం
- విశ్వనాథుని ఆశీస్సులతో తిరిగి రావాలి: సీఎం నవీన్



యాత్రికులకు వర్చువల్‌గా శుభాకాంక్షలు చెబుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: వయోవృద్ధుల తీర్థయాత్ర స్పెషల్ రైలు శుక్రవారం బయల్దేరింది. భువనేశ్వర్ నుంచి ప్రయాగ్‌రాజ్ మీదుగా వారణాసి వరకు ఈ రైలులో యాత్ర కొనసాగుతుంది. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విశ్వనాథుని దర్శన అనంతరం ఆశీస్సులతో సుఖమంతంగా తిరిగి రావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది 7వేల మంది వయో వృద్ధులకు ఉచిత తీర్థయాత్ర సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. తొలి విడతగా భువనేశ్వర్ రైల్వేస్టేషన్ నుంచి 982మంది వృద్ధులు యాత్రకు బయల్దేరారు. వీరంతా ఖుర్దా, నయాగడ్, పూరీ, కటక్, జగత్‌సింఘ్‌పూర్, కేంద్రాపడా, ఢెంకనాల్ జిల్లా వాసులుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరై, జెండా ఊపి తీర్థయాత్ర స్పెషల్ రైలును ప్రారంభించారు. 2016 జూలై 25న రాష్ట్రప్రభుత్వం వయోవృద్ధుల తీర్థయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు 15సార్లు యాత్ర కార్యక్రమం విజయవంతంగా చేపట్టగా.. కరోనా తాండవంతో గత రెండేళ్లుగా ఈ కార్యక్రమం నిలిచిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి 14,500 మంది వృద్ధులు మధురై, రామేశ్వరం, ప్రయాగ్‌రాజ్, వారణాసి, హరిద్వార్, ఆగ్రా, మధుర, బృందావనం, హృషీకేష్, అజ్మీర్, నాగపట్నం, తిరుపతి, వెల్లూరు, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వర్, వెళ్లంకిణి, తంజావూరు, దక్షిణేశ్వర కాళీ, కోల్‌కత్తా, కంచి తదితర పవిత్ర పుణ్యక్షేత్రాలు సకల సౌకర్యాలతో ఉచితంగా సందర్శించారు.



భువనేశ్వర్ రైల్వేస్టేషన్ నుంచి తీర్థయాత్రకు సిద్ధమైన వయోవృద్ధులు

ఆర్‌సెట్‌లో రాణించిన విజయలక్ష్మి



విజయలక్ష్మి

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో పట్టణానికి చెందిన యేడువాక విజయలక్ష్మి సత్తా చాటింది. ఆంధ్రవిశ్వ విద్యాలయం చరిత్ర విభాగంలో కేటాయించిన ఒక్కటే పార్ట్ టైమ్ సీటును విజయలక్ష్మి సాధించారు. గతంలో ఆమె పీహెచ్‌డీకి అర్హత సాధించినప్పటికి అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకురాలిగా పనిచేయడంతో వీలుకాక వెళ్లలేదు. గత ఏడాది జిల్లా ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిగా ఆంధ్రా యూనివర్సిటీ పురస్కారం సాధించిన విజయలక్ష్మి, జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు యువనాయకత్వ పురస్కారాలను భారత ప్రభుత్వం నుంచి సాధించారు. ప్రస్తుతం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక్క సీటును గట్టి పోటీ మధ్య ఆమె సాధించడం పట్ల స్థానియ జియో, సిమ్ సంస్థల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ

పార్వతీపురం: పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డుదారులకు ఫిబ్రవరి నెల నుంచి గోధుమ పిండి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీలలో కార్డుదారులకు నెలకు రెండు కిలోల పిండిని కిలో రూ.16 చొప్పున అందించాలని పేర్కొన్నారు. పీడీఎస్ కార్డుదారులకు రేషన్ వాహనం ద్వారా కందిపప్పు, పంచదార పంపిణీ చే స్తామని కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

100 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, అటవీశాఖ సిబ్బంది

బరంపురం: అవిభక్త గజపతి-గంజాం జిల్లాల సరిహద్దు దిగపండి బ్లాక్ పరిధి పట్టపూర్ పోలీసు స్టేషన్ సమీపంలోని అటవీ ప్రాంతాల్లో ఎక్సైజ్, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో 100 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి తోటలను గుర్తించారు. మొక్కలను తొలగించి, నిప్పంటించారు. పరిసర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులతో మాట్లాడి, నిషేధిత పంటలను సాగు చేయవద్దని, ఆదాయానిచ్చే చోడి, అపరాల పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.

ఆటోను లారీ ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బొబ్బిలి రూరల్: పట్టణంలోని ఐటీఐకాలనీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలం కొండకెంగువకు చెందిన 8మంది బొబ్బిలి మండలం అలజంగిలో ఓ వివాహానికి హాజరై తిరుగుప్రయాణంలో ఆటోలో స్వగ్రామం వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతోజరిగిన ప్రమాదంలో అంపోలు హేమలత, బంగారులక్ష్మి, కృష్ణమ్మ, ధనలక్ష్మలతో పాటు బెవర రవి గాయపడ్డారు. క్షతగాత్రులను సీహెచ్‌సీకి తరలించగా, వైద్యులు ప్రథమచికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి..

రాజాం సిటీ: స్థానిక మెయిన్ రోడ్డులో బైక్ ఢీకొనడంతో ఓవృద్ధుడు గాయపడినట్లు సీఐ కె.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న తెలగవీధికి చెందిన వృద్ధుడు ముంజేటి రాజయ్య రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో గాయాల పాలైన రాజయ్యను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. వృద్ధుడి మనుమడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కున్న నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన నిందితులను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాలాజీ కూడలి వద్ద ఈ నెల 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముగ్గురు దుండగులు అడ్డుకుని కత్తులతో బెదిరించి, సెల్‌ఫోన్ లాక్కెళ్లినట్లు కొత్తపేటకు చెందిన రెడ్డి సన్యాసిరావు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద స్కూటీపై అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయనగరంలోని మంగలివీధికి చెందిన షేక్‌హుస్సేన్, మరో ఇద్దరు జువైనల్స్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో నిందితులు నేరాన్ని అంగీకరించారు. అనంతరం నిందితుడి దగ్గర నుంచి ఒక సెల్‌ఫోన్, రెండు కత్తులు, స్కూటీని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువైనల్స్‌ను జువైనల్ హోమ్‌కి తరలించినట్లు తెలిపారు.

సారా నిషేధానికి తీర్మానం




గ్రామంలో నిర్వహిస్తున్న సమావేశం

సాలూరు: దశలవారీగా మద్యపాన నిషేధం దిశగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మరిపల్లి గ్రామస్తులు నడుంబిగించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి గ్రామంలో పెద్దల ఆధ్వర్యంలో ప్రజలంతా సమావేశమై చర్చించారు. ఈ క్రమంలో గ్రామంలో సారా అమ్మరాదని అలా అమ్మినట్లయితే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వారికి అమలుచేయరాదని కోరతామని, అంతేకాక సారా విక్రయిస్తూ మొదటిసారి దొరికితే రూ.పదివేల జరిమానా, పోలీసుకేసు, రెండవ సారి దొరికితే పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరతామని గ్రామస్తులంతా తీర్మానించారు. అందరం ఐక్యంగా ఉండి సారా నిర్మూలనకు కృషి చేయాలని చర్చించుకున్నారు.

క్లుప్తంగా

నెమలి పింఛంపై ఆదిత్యుని రూపం



నెమలి పింఛంపై ఆదిత్యుని రూపం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని చిత్తరంజన్ వీధిలో నివా సముంటున్న వాడా డ రాహుల్ పట్నాయి క్ రథసప్తమిని పురస్కరించుకొని అరసవల్లి సూర్యనారాయణ స్వామి (ఆదిత్యుడు) నిజరూపాన్ని నెమలి పింఛంపై వేసి ప్రతిభను చాటుకున్నారు. గతంలో తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని కూడా ఈయన నెమలి పింఛంపై తీర్చిదిద్దారు. ఆజాదీకి అమృత్ మహోత్సవ్ తో పాటుగా 75వ స్వాతంత్ర్య వేడుకల్లోనూ దేశ జాతీయ పతాకాన్ని అందంగా తన కుంచెతో చిత్రీకరించి పలువురి ప్రశంస లు పొందారు. ఈ చిత్రాలను తాను కేవలం రెండు మూడు గంటల్లో వేశానని రాహుల్ తెలిపారు.

రథసప్తమికి 10 ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆర్టీసీ 10 ప్రత్యేక బస్సులను నడుపుతుందని ఆర్టీసీ ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. విశాఖపట్టణం, బొబ్బిలి, రాజాం తదితర రూట్ల నుంచి వచ్చే భక్తుల కోసం సింహద్వారం వద్ద నుంచి అరసవల్లి కూడలి వరకూ 6 బస్సులు, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అరసవల్లి కూడలి వరకూ 4 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. రద్దీ దృష్ట్యా అదనపు బస్సులను కూడా నడపనున్నట్లు శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్‌లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మలు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గొర్రెల మందను ఢీ కొని డిగ్రీ విద్యార్థి దుర్మరణం

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారిపై జర్జంగి వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థి దేవాడ తేజేశ్వరరావు (19) మృతి చెందగా, మరో ఇద్దరు డిగ్రీ విద్యార్థులు విజయ్ పట్నాయక్, సాయి సుమంత్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజేశ్వరరావు తన స్నేహితులు విజయ్ పట్నాయక్, సాయి సుమంత్‌తో కలిసి గురువారం బైక్‌పై నరసన్నపేట మండలం దేవాదిలోని తన స్నేహితుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో తిరిగి స్వగ్రామానికి చేరుకునేందుకు బైక్‌పై వస్తుండగా జర్జంగి వద్దకు వచ్చేసరికి గొర్రెల మంద అడ్డంగా రావడంతో మంచులో అవి కనిపించక అమాంతం ఢీకొట్టారు. దీంతో అంతా కిందపడిపోయారు. తేజేశ్వరరావు మృతిచెందగా, మిగిలిన వారికి దెబ్బలు తగిలాయి. వీరికి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు.

అధికారులపై కలెక్టర్ మండిపాటు

పాతపట్నం: జిల్లాలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్‌ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పాతపట్నం మండలంలోని కొరసవాడ, బూరగాం గ్రామ సచివాలయం, కొరసవాడ, గ్రామ సచివాలయం, ఆర్‌బీకే నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే పనులు పూర్తి కావడం లేదని అన్నారు. దీంతో మండల ఇంజినీర్ టి.ప్రసాద్‌రావుకు సస్పెన్షన్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు అందిస్తామని పేర్కొన్నారు. కొరసవాడ గ్రామ సచివాలయ నిర్మాణంలో బిల్లులు సకాలంలో అందాయని, సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వల్ల గత ఎనిమిది నెలల నుంచి భవన నిర్మాణం పనులు చేపట్టడం లేదన్నారు. కొరసవాడ ఆర్‌బీకేలో రైతులకు అందిస్తున్న ఎరువులను పరిశీలించి, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. తక్కువ డబ్బులకే ఎరువులు అందిస్తున్నారని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. పాతపట్నంలోని శ్రీనీలంతేశ్వర ఆలయం సమీపంలోని రైతుల పంట పొలాలను, తెంబూరు గ్రామంలోని పంట పొలాలను కలెక్టర్ రైతులతో కలిసి పరిశీలించారు. ఆయనతో పాటు ఏడీఏ తిరుమలరావు, తహసీల్దార్ రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, ఏఓ రవికుమార్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, మండల ఇంజినీర్ రామగణపతి, కొరసవాడ, బూరగాం, తెంబూరు, సర్పంచ్‌లు జక్కర ఉమా, బెనియా వెంకటరమణ, ప్రహ్లాద్ పుల్లార్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న వైస్ ఎంపీపీ ఎన్నిక

గార: మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నిక ఫిబ్రవరి 3న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంపిక చేయాలని ఉన్నతాధికారులు తెలిపారు. గార వైస్ ఎంపీపీ బరాటం రామశేషు మృతిచెందడంతో ఎన్నిక జరగాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీ గా ఉన్న స్థానాలతో పాటు ఈ స్థానానికి కూడా ఎన్నిక జరగనుంది.

డాబాపై డ్రాగన్ తోట

- కోవిడ్ తెచ్చిన కొత్త ఆలోచన
- గతేడాది నుంచి పూత
- వందకుపైగా మొక్కలు
- ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు వినూత్న సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న సుదర్శనం అధికారి

రాజాం: ఆయనొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వ్యవసాయమంటే మక్కువ. కోవిడ్ సమయంలో తల్లిదండ్రుల సాయంతో విదేశాల్లో బాగా కలిసివస్తున్న డ్రాగన్ పంట సాగుపై దృష్టిసారించాడు. ఆ పంటకు ఇక్కడ ఉన్న డిమాండ్ గుర్తించాడు. వేసిన పంట ద్వారా ఫలసాయం పొందాలని భావించాడు. దీనికోసం ఏకంగా తన ఇంటి డాబానే వ్యవసాయ క్షేత్రంగా మలిచాడు. వందకు పైగా మొక్కలు నాటాడు. సస్యరక్షణ చర్యలు చేపట్టాడు. డ్రాగన్ తోట ఏపుగా పెరిగి దిగుబడి ఆరంభం కావడంతో... కష్టం ఫలించిందంటూ సంబరపడుతున్నాడు. ఆయనే రాజాం పట్టణం పరిధిలోని డోలపేట గ్రామానికి చెందిన సుదర్శనం అధికారి.

ఆరు సెంట్ల విస్తీర్ణంలో...

సుదర్శనం అధికారి విశాఖపట్నంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయనకు చిన్నప్పటి నుంచి రకరకాల పంటలు సాగుచేయడమంటే ఇష్టం. తల్లిదండ్రులు నర్సమ్మ, శాంతిమూర్తిల ప్రోత్సాహంతో కొంత పొలాన్ని కొనుగోలుచేసి మామిడితోటలు, జీడితోటలతో పాటు పొలాలు, ఇంటి ఆవరణలో వివిధ రకాల మొక్కలు సాగుచేస్తుంటాడు. అదే క్రమంలో కోవిడ్ సమయంలో ఇంటి డాబాపై డ్రాగన్ పంట సాగుకు పూనుకున్నాడు. 25 స్తంభాలు ఏర్పాటుచేసి ఆరుసెంట్లు విస్తీర్ణంలో ఉన్న డాబాపై వందకుపైగా డ్రాగన్ మొక్కలు 2020లో నాటాడు.

గతేడాది జూలై నెల నుంచి కాపు ఆరంభమైంది. ఒక్కో మొక్కకు 12 నుంచి 15 వరకూ డ్రాగన్ పండ్లు దిగుబడి రావడంతో పాటు నాలుగు నెలలు పాటు పూత సాగింది. ఒక్కొక్కటి 800 గ్రాముల నుంచి 900 గ్రాముల బరువు ఉన్న పండ్లు దిగుబడి వస్తున్నాయి. పోషకాలు మెండుగా ఉన్న డ్రాగన్ పండ్ల కొనుగోలుకు ప్రస్తుతం అధికమంది ఆసక్తిచూపుతున్నారు.



డ్రాగన్ మొక్కలకు వేస్తున్న సేంద్రియ ఎరువు



రెండో అంతస్తుపై డ్రాగన్ తోట

అభిరుచితోనే...



మా ఇంటిపై ఏవో మొక్కలు వేద్దామని అనుకున్నాను. కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ కావడంతో ఆలోచన వచ్చింది. నెట్‌లో చెక్‌చేసి డ్రాగన్ తోటలుపై దృష్టిసారించారు. ఖమ్మం నర్సరీతో పాటు రేగిడి మండలం కాగితాపల్లి వద్ద దూబ రమేష్ నర్సరీ నుంచి మొక్కలు తెచ్చాం. రూ.2 లక్షలు వెచ్చించి తోట వేశాం. ఇప్పుడు ఇవి అందంగా ఉండడంతో పాటు సీజన్‌లో మంచి పూత వస్తోంది. గతేడాది రూ.1.50 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

– సుదర్శనం అధికారి, డోలపేట



ఒక్కో పిల్లర్ వద్ద ఆరోగ్యకరంగా పెరిగిన మొక్కలు



పూతకొచ్చిన మొక్కలు

నిరంతరం ఇద్దరు..

పొలం, ఇంటి వద్ద మొక్కల సంరక్షణకు ఇద్దరు రైతు కూలీలను నియమించాడు. ప్రతీ రెండు రోజులకు డ్రాగన్ మొక్కలకు నీరు పెట్టడం, ఏపుగా పెరిగిన కొమ్మలు తొలగించడం, పేడ గత్తం, వేప ఆకులతో సేంద్రియ ఎరువు తయారుచేసి మొక్కలపై పిచికారీ చేయడం వంటి పనులను వారు చక్కబెడుతున్నారు. డ్రాగన్ తోట సాగుతో ఇల్లు కూడా చల్లగా ఉంటోందని ఆయన చెబుతున్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

- దేవదాయ శాఖ మంత్రిని కోరిన ఎంపీ 'బెల్లాన'

చీపురుపల్లి: పట్టణంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధులు మంజూరుచేయాలని ఆ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర నిశ్చితార్థ వేడుకలకు హాజరైన రాష్ట్ర మంత్రికు ట్రస్టు సభ్యులతో కలిసి నిధుల అవసరాన్ని వివరించారు. నిర్మాణంలో ఉన్న లయానికి సంబంధించిన ఫొటోలను చూపించారు. రూ.3.5 కోట్లు అంచనా వ్యయంతో అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు చెప్పారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వార్డు మెంబర్ గంట్యాడ విష్ణు ఇవ్వగా, ఇంతవరకు రూ.50 లక్షల వరకు దాతలు సమకూర్చారన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ నుంచి రూ.కోటి వరకు నిధులు అందించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం బోర్డు సభ్యుడు ఇప్పిలి తిరుమల, మాజీ వార్డు మెంబర్ పీతల మురళి తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణకు పరిశ్రమల ఏర్పాటు

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో పిరియా విజయ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టడానికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పనున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం 2, 4, 7, 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు భరోసా ఇవ్వడానికి స్పెషల్ ఎకనామిక్ జోన్ తరహాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం, పైడిభీమవరం మధ్య 5000 ఎకరాల్లో స్పెషల్ ఎకనామిక్ జోన్ పెట్టేందుకు అనుకూలంగా ఉందన్నారు. ఈ పారిశ్రామిక వాడకు తూర్పున బంగాళా ఖాతం, టెక్కలి భావనపాడు నౌకాశ్రయం దక్షిణాన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పడమ రన జాతీయ 6 లైన్ల రహదారి, భారత్ రైల్వే రవా ణా మార్గం ఉపయోగపడతాయన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించేందు కు జిల్లా ప్రజా పరిషత్ రెండోస్థాయీ సంఘం సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు.

దీంతో ఈ అంశాన్ని రాబోయే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అజెండాలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ పర్యాటకులతో పాటు జాతీయ టూరిస్టులను ఆకర్షించే ఉద్దేశంతో శ్రీకాకుళం, విశాఖపట్నం మూడు జిల్లాల్లోని బౌద్ధారామాల అనుసంధానం, కళింగపట్నం బీచ్‌లో మౌలిక వసతులు కల్పించి 'బుద్ధిస్టిక్ సర్క్యూట్' టూరిజం అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్ర టూరిజం శాఖతో సంప్రదించి మహేంద్ర గిరిపై 'ట్రెక్కింగ్ టూరిజం' ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణసంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న జగనన్న కాలనీలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం 4వ జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారితో సమీక్షించారు. 1,7వ స్థాయీ సంఘాల్లో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ తదితర శాఖల ప్రగతి నివేదికలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.



మాట్లాడుతున్న పిరియా విజయ

'ప్రవేశాలు మెరుగుపరచాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో మెరుగైన ప్రవేశాలు లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం విద్యార్థులతో క్లాస్‌వర్క్, ఇంటర్న్‌షిప్‌లపై మాట్లాడారు. అధ్యాపకులతో సమీక్ష నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. సీతంపేట మోడల్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు తక్కువగా జరుగుతున్నాయని, పెరిగేలా ప్రచారం చేయాలన్నారు. వారం రోజుల్లో పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పాలీసెట్–2023 నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. మే 10న సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణతో పాటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కరోనా కారణంగా ప్రవేశాలు, క్లాస్‌వర్క్, ఫలితాల ప్లేస్ మెంట్‌లపై ప్రభావం చూపిందని, భవిష్యత్‌లో కరిక్యులమ్ గాడిన పడుతుందన్నారు. పక్కాగా క్లాస్‌వర్క్, పరిశ్రమల్లో శిక్షణ, విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లపై దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ప్రమాణాలకు లోబడి విద్యను అందిస్తామని అన్నారు. 10వ తరగతి తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించే పాలిటెక్నిక్‌కు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సప్లిమెంటరీ రాసే వారి కోసం ప్రత్యేక క్లాస్ నిర్వహిస్తున్నామన్నారు.

పాలిసెట్ దరఖాస్తుల ప్రవేశ రుసుం ఎస్సీ, ఎస్టీలకు రూ.100కు తగ్గించినట్లు చెప్పారు. బీసీ, ఓసీలకు రూ.400 అని తెలిపారు. ప్రభుత్వం అర్హులందరికీ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వర్తింపజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏపీ రామకృష్ణ, సెక్రటరీ కె.విజయభాస్కరరావు, జాయింట్ సెక్రటరీ కె.నారాయణరావు, స్థానిక ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నాగరాణి

ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారుల దాడులు

జి.సిగడాం: ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచిన దుకాణాలపై దాడులు చేస్తున్నామని విజిలెన్స్ సీఐ బి.సింహాచలం వెల్లడించారు. ఆయన శుక్రవారం పాలఖండ్యాం గ్రామంలో శివరామకృష్ణ ట్రేడర్స్, కావేరి ఎరువుల షాపులపై దాడులు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు దాడులు చేస్తున్నామన్నారు. పాలఖండ్యాం మెయిన్ రోడ్డులోని శివరామ కృష్ణ ఎరువుల షాపు స్టాక్ రికార్డులో భారీ వ్యత్యాసం ఉండడంతో తనిఖీ చేశామన్నారు. ఈ షాపులో 15.425 మెట్రిక్ టన్నుల ఎరువులు తేడా ఉండటంతో సీజ్ చేశామని తెలిపారు. సంబంధిత యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

● ఎండి'నది'



వంశధారలో ఇసుక తిన్నెలు బయటకు వస్తున్నాయి. నీరు ఎండిపోవడంతో చెవ్వాకులపేట గ్రామం సమీపంలో ఉన్న నది ఇలా బోసిగా కనిపిస్తోంది. –ఆమదాలవలస రూరల్

● అరుదైన క్షేత్రం.. ఆదిత్య ధామం

విగ్రహం నుంచి నైవేద్యం వరకు.. ఊరేగింపు నుంచి ఉత్సవం వరకు.. ఆవిర్భావం నుంచి వర్తమానం వరకు.. అన్నింటా ఆదిత్య క్షేత్రం అపురూప దివ్యధామంగా విరాజిల్లుతోంది. సూర్యుడికి గుడి కట్టడం, ఆ కోవెలను దండయాత్రల్లో కూలగొట్టడం, ఆపై మళ్లీ స్వామిని పునఃప్రతిష్ఠించడం, ఆ ఆలయం అంచెలంచెలుగా ఎదిగి పుణ్యక్షేత్రంగా మారడం అన్నీ ఈ స్థల ప్రాశస్త్యానికి ప్రతీకలే. ఇంద్రుడి నుంచి ఇప్పిలి వంశీయుల వరకు అంతా స్వామిని పూజించి తరించిన వారే. గంగరాజుల నుంచి వరుదు వారి వరకు అందరూ తరతరాలుగా స్వామిని పునఃప్రతిష్ఠించుకుని కాపాడుకున్న వారే. రథసప్తమి నాడు అరసవల్లి కీర్తిని పరిశీలిద్దాం రండి. – అరసవల్లి



కనరో భాగ్యము..



ఏడు గుర్రాలు ..ముగ్గురు భార్యలతో అరసవల్లి క్షేత్రంలో శ్రీవారు కొలువుదీరారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవి అనే ముగ్గురు భార్యలతో సూర్యభగవానుడు శాలిగ్రామ ఏక శిలతో విగ్రహరూపుడై ఉంటారు. స్వామి సింహలగ్న జాతకుడైనందున ఆయన విరాట్టుపై సింహతలాటం ఉంటుంది. ఆయనకు రెండు హస్తాలుంటాయి. వాటితో రెండు తామర పద్మాలను పట్టుకుని ఉంటారు. స్వామివారికి సనక, సనందులు అనే ఇద్దరు సేవకులు నిత్యం.. ఛత్ర, ఛామరలతో స్వామికి సేవ చేస్తుంటారు. స్వామివారి నడుముకు చురిక (చిన్న కత్తి) ఉంటుంది. తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఇలానే చురిక ఉంటుంది.

కిరణ స్పర్శ..



మూలవిరాట్టు ఉన్న స్థానబలమో, స్వామి వారి మహిమ వల్లనో గానీ, ప్రతి ఏటా ఉత్తరాయన, దక్షిణాయన కాలమార్పుల్లో నేరుగా తొలి లేత కిరణాలు నేరుగా స్వామి వారి మూలవిరాట్టును ప్రతి భాగమూ స్పృశించడం ఇక్కడి క్షేత్ర మహత్యంగా చెప్పుకుంటారు. ఈ లెక్కన ప్రతి ఏటా మార్చి 9,10 తేదీల్లోనూ, అలాగే అక్టోబర్ 1,2 తేదిల్లోనూ స్వామి వారిని సూర్య కిరణాలు తాకుతుంటాయి. ఆరోగ్యం కోసం ఇక్కడ సూర్యనమస్కార పూజలు చేస్తూ స్వామిని నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండడంతో సూర్యక్షేత్రం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది.

నాడు హర్షవల్లి.. నేడు అరసవల్లి

ప్రత్యక్ష దైవం శ్రీసూర్యనారాయణ స్వామి వారు కొలువైన ఏకైక సూర్యక్షేత్రంగా, దేశంలోనే నిత్య పూజలందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా అరసవల్లి విరాజిల్లుతోంది. శతాబ్దాల క్రితం నుంచి ఆరోగ్యం కోసం ఇక్కడ విగ్రహానికి పూజలు చేసేవారు. తలనీలాలను సమర్పించి, ఇంద్ర పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి సూర్యనమస్కారాలు చేసేవారు. ఇలా చేయడంతో తమ కోర్కెలు ఫలించడంతో పాటు పూర్తి ఆరోగ్యవంతులుగా తమ ప్రాంతాలకు సంపూర్ణ హర్షంతో తిరిగి వెళ్లేవారు. అందువల్ల ఈ క్షేత్రానికి హర్షవల్లి అని పిలిచేవారని ప్రతీతి. అయితే కాలక్రమేణా ఇది అరసవల్లిగా మారింది.

శతాబ్దాల చరిత..



గంగ వంశరాజు గుణశర్మ వారసుడైన కళింగరాజు దేవేంద్రవర్మ క్రీస్తు శకం63 సంవత్సరంలో ఈదేవాలయాన్ని నిర్మించారని ఇక్కడ లభించిన శాసనాలు చెబుతున్నాయి. 7వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం దేవేంద్రునిచే నిర్మితమైందని పురాణాలు చెబుతున్నాయి. క్రీస్తు శకం 16వ శతాబ్దంలో హర్షవల్లి ప్రాంతానికి నిజాం నవాబు వద్ద సుబేదార్‌గా పనిచేసిన షేర్ మహమ్మద్ ఖాన్ ఈ ఆలయాన్ని ధ్వంసం చేసినట్లుగా ఒక శాసనంలో పేర్కొనబడి ఉంది. ఆయన వద్ద ఉద్యోగిగా ఉన్న సీతారామస్వామి అనే పండితుడు, మహమ్మద్ ఖాన్, హర్షవల్లిపై దండెత్తుతాడని తెలుసుకుని, ఆలయంలోని మూలవిరాట్టును తీసుకుని సమీపంలోని ఒక బావిలో పడేసారట. కొన్నేళ్ల తర్వాత అనగా క్రీస్తు శకం 1778వ సంవత్సరంలో ఎలమంచిలి పుల్లాజీ పంతులు ఆ బావిలో మూలవిరాట్టును కనుగొని, తర్వాత ధ్వంసమైన ఆలయాన్ని పునర్నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

నభోమూర్తి నగధగలు



వెలుగుల రేడు ప్రత్యేక పర్వదినాల్లో స్వర్ణకాంతుల్లో దర్శనమిస్తుంటారు. 3.361 కేజీల బంగారంతో మకర తోరణాన్ని స్వామి వారికి భక్తులు సమకూర్చారు. అలాగే స్వామి వారికి 18 కేజీల బంగారు, 540 కేజీల వెండి ఆభరణాలు ఉన్నాయి.

వరుదు వంశీయుల ఉదారత్వం.. ఇప్పిలి వంశీయుల అర్చకత్వం



1999లో ప్రముఖ గ్రానైట్ వ్యాపారి దివంగత వరుదు బాబ్జీ దంపతులు ఆలయ వాస్తు నిర్మాణం దెబ్బతినకుండా గర్భగుడిపై విమానాన్ని పడగొట్టి, దక్షిణాది పద్ధతిలో కాకుండా ఓఢ్ర (ఒడిశా) సంప్రదాయంతో పునర్నిర్మించారు. రథం ఆకృతిలో ఈ నిర్మాణం దర్శనమిస్తుంది.

- ఈ దేవాలయంలో ఇప్పిలి వంశీయులు వంశపారంపర్య అర్చకత్వం వహిస్తూ భక్తులకు స్వామికి అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన అర్చకులుగా ఇప్పిలి శంకరశర్మ వ్యవహరిస్తున్నారు.

భర్తపై రోకలితో దాడి

కొత్తూరు: కొత్తూరు మండలం మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలో భర్తపై భార్య దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం జరిగింది. మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీకి చెందిన జి.చందన రోకలితో తనపై దాడి చేసిందని భర్త నాగార్జున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ కృష్ణ తెలిపారు. గాయాలైన నా గార్జునను కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేశారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

'నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు'

ఎల్.ఎన్.పేట: వంశధార పునరావాస కాలనీల్లో దేవాలయాల నిర్మాణం కోసం దేవదాయ శాఖ ద్వారా విడుదలైన నిధులు దుర్వినియోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని టెక్కలి సబ్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని శ్యామలాపురం పునరావాస కాలనీలో ఆయన శుక్రవారం పర్యటించారు. పునరావాస కాలనీలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం పాత గ్రామంలో ఆలయాలు ఉన్నట్లే పునరావాస కాలనీల్లోనూ ఆలయాల నిర్మాణం జరగాల్సి ఉందని, ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ బలగ లక్ష్మి చేసుకున్న విన్నపం మేరకు ఆయన కాలనీలో పరిశీలన చేశారు. పునరావాస కాలనీ పేరుతో హిరమండలం మండలంలోని ఓ ఆలయం పేరుతో నిధులు విడుదలయ్యాయని సర్పంచ్ తెలిపారు. ఇక్కడ ఆలయం ఉంటే మరో చోట నిధులు ఎలా మంజూరు చేస్తారని ఆయన దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు.

పునరావాస కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి చెల్లించాల్సిన నిధులు ఎవరికీ సంబంధం లేని వ్యక్తి బ్యాంక్ ఖాతాలకు జమచేశారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అలా ఎందుకు చేశారో సమగ్ర వివరాలతో మంగళవారం టెక్కలిలోని తన కార్యాలయానికి వచ్చి తెలి యజేయాలన్నారు. నిధులు ఖర్చుల్లో తేడాలు ఉంటే ఉద్యోగాలు వదులుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పునరావాస కాలనీలో అంగన్‌వాడీ భవనం, పాఠశాల భవనం, పంచాయతీ భవనం, వంశధార హైలెవల్ కాలువపై కాలినడక వంతెన నిర్మాణం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రేషన్ డిపోను మరో చోటుకు మార్చుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా నిర్వహించాలని, కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని అంగన్‌వాడీ కార్యకర్తను హెచ్చరించారు. ఆయనతో పాటు తహసీల్దార్ బీఎస్ఎస్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, ఈఓపీఆర్డీ జి శ్యామలాదేవి, బలగ గోవిందరావు, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వంశధార ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి